జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 17-09-2024 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 126 పేజీలు: 8 వెల : రూ.7






జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 17-09-2024 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 126 పేజీలు: 8 వెల : రూ.7



## అంతిమ కష్టాలు

**జలుమూరు, సెప్టెంబరు 16 (వార్త):** చనిపోయిన వారికి స్మశానానికి తీసుకువెళ్లేందుకు సరైన రోడ్డు లేక జలుమూరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన దళితులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. లింగాలపాడు దళిత కాలనీకి చెందిన ఒకరు సోమవారం మృతి చెందారు. కుటుంబీకులు, కాలనీవాసులు మృతదేహాన్ని స్మశానానికి తరలించేందుకు నానాపాట్లు పడ్డారు. రోడ్డు లేకపోవడంతో పొలం గట్లపై నుంచి ఇబ్బందులు పడుతూ తీసుకువెళ్లారు. స్మశానానికి రహదారి సదుపాయం కల్పించాలని కాలనీవాసులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి.

## కబ్జాదారులపై.. అచ్చెన్న ఉక్కుపాదం



* ఎంతటి వారినైనా విడిచి పెట్టొద్దు
* అధికారులను ఆదేశించిన మంత్రి
* టెక్కలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం
* వంశధార స్థలాలపై సర్వే చేసి నివేదిక ఇవ్వండి
* పాత బస్టాండ్ రహదారిలో షాపుల తొలగింపు

**టెక్కలి, సెప్టెంబరు 16 (వార్త):** టెక్కలి పట్టణంలో అక్రమణదారులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కొరడా విదిల్చారు. సోమవారం టెక్కలిలోని అయ్యప్పనగర్, మండాపోలం కాలనీ, తదితర ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. కబ్జాదారులపై ఉక్కుపాదం మోపాలని, ఎంతటివారైనా ఊపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. పాలశీతల కేంద్రం ఎదురుగా ఉన్న స్వర్ణకారుల భూములపై కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. నూతన ఆసుపత్రి భవనం ప్రాంతంలో వంశధారకు చెందిన భూములు చాలావరకు కబ్జా గురైనట్టు తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు సమగ్ర సర్వే చేయాలన్నారు. ఇందిరా గాంధీ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డు పక్కన ఉన్న చిరు దుకాణాలను తొలగించి, వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా అక్రమంగా వెలసిన దుకాణాలను సైతం తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల ఆక్రమణతో టెక్కలి పట్టణం ఇరుకుగా మారుతోందన్నారు. టెక్కలి పట్టణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.





## మాజీ సైనికుల కోసం.. ప్రత్యేక కార్పొరేషన్

* వారి సేవలు స్ఫూర్తిదాయకం
* సైనిక అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటుకు కృషి
* పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తా
* కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* వరద బాధితులకు శ్రీకాకుళం జిల్లా మాజీ సైనిక ఉద్యోగులు భారీ విరాళం

**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబరు16 (వార్త):** సైనిక ఉద్యోగంలో భాగంగా దేశ సేవలో ఉన్నా.. విరమణ అనంతరం సామాజిక సేవలో ఉన్నా.. మాజీ సైనిక ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లాలో సైనిక అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేసే విధంగా కలెక్టర్‌తో చర్చిస్తానని భరోసా ఇచ్చారు. జిల్లాకు చెందిన 16మాజీ సైనిక ఉద్యోగ సంఘాల సభ్యులంతా కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షల 116లు విరాళాలను సేకరించారు. దీనికి సంబంధించిన చెక్కు శ్రీకాకుళంలోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కష్ట సమయాల్లో తమ వంతు సాయం చేయడం ఎంతో ఆదర్శవంతమని తెలిపారు. జిల్లాలోని సైనికులు, వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఎర్రన్న జవాన్ మిత్ర, జవాన్ డిక్లరేషన్ కార్యక్రమాలను చేపట్టానన్నారు. తన అనుభవం, చొరవతో రాష్ట్రంలో ఒక్కో సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చక్కదిద్దుకుంటూ వస్తున్నారని తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా సీఎంతో మాట్లాడుతానని తెలిపారు. అలాగే పలాసలో కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

## మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

జలుమూరు, సెప్టెంబరు 16(వార్త): జలుమూరు మండలం మాకివలస ఇసుక ర్యాంపులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం చేసుకున్నామని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. తమకు ఆ ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరరకు మాటు వేసి వీటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక కారును కూడా సీజ్ చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.



# భక్తి,శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



పలాస, సెప్టెంబరు 16(వార్త): పలాసలో మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. కాశీబుగ్గలోని జామియా మసీద్‌లో ప్రార్థనలు చేసిన అనంతరం పలువురు ముస్లిం సోదరులు పలాసలో శాంతి ర్యాలీ నిర్వహించారు.

జామియా మసీద్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ సర్వ మాన వాళికి, ప్రపంచ శాంతికి దివ్య పురుష డైన మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకో వడం సంతోషంగా ఉందన్నారు. మహ్మద్‌ప్రవక్త బోధనలు, అనుసరించిన విధానాలు ఖురాన్‌లో పొందు పరిచారని తెలిపారు. ముస్లింలంతా ఐక్యతతో ప్రపంచ శాంతికి పాటు పడాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో హుస్సేన్, ఎస్ఏకే జిలానీ తమీమ్, గౌస్, ఖాసిం రెహీమాన్, షాహిద్ డింబు, గఫూర్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి:** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మెళియాపుట్టిలోని ముస్లిం వీధిలోని మసీదులో ముస్లింలకు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ శిలార్, మండల తెలుగు యువత అధ్యక్షుడు బస్వ పరమేశ్వర్ రెడ్డి, ముస్లిం పెద్దలు షేక్ షైన్, షేక్ చాంద్, ఇబ్రహీం, షేక్ మహ్మదు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



# జమచక్రంలో సత్యసాయి బాబా పల్లకీ సేవ



సారవకోట, సెప్టెంబరు 16(వార్త): సారవకోట మండలంలోని జమచక్రం గ్రామంలో సోమవారం సత్యసాయి బాబా పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారి చిత్రపటానికి గ్రామంలో పల్లకి సేవ చేపట్టారు. పాతపట్నం సత్య సాయి జోన్ ఆధ్వర్యంలో బాబా జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ పల్లకి సేవ చేప ట్టామని నిర్వాహకులు తెలిపారు.

# తాగునీటి సమస్యను తీర్చిన జనసేన నేత

పాతపట్నం, సెప్టెంబరు 16(వార్త): పాతపట్నం మండలం సింగుపురం గ్రామంలో కొన్ని వీధులకు తాగునీరు సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న జన సేన నాయకుడు ఏనుగుతల వైకుంంరావు చర్యలు చేపట్టారు. ఆ గ్రామ వాసులు ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందిస్తూ సొంత డబ్బులు సుమారు రూ.2.50 లక్షలతో బోర్ వేయించారు. పలు వీధులకు కొళాయిల ద్వారా నీటి సరఫరా సౌకర్యం ఏర్పాటు చేసి వారి దాహార్తిని తీర్చారు. వైకుంఠరావు సహాయానికి సింగుపురం గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి సభ్యులు ఎస్.రమణారావు, పడ్డ లోకేశ్వరరావు, ఆర్.మాధవరావు, టి.లక్ష్మణరావు, ఎస్.వాసు, టి.ఆనంద్, ఆర్.ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## సతీష్‌ని పరామర్శించిన ధర్మాన తేజ



జలుమూరు, సెప్టెంబరు 16(వార్త): శ్రీముఖలింగం సర్పంచ్ తమన్నగారి సతీష్ మాతృమూర్తి ఇటీవలే స్వర్గస్తులైన సంగతి తెలిసిందే. దీంతో ఆయనను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకుడు దేవా, వెంకటాపురం సర్పంచ్ కొర్ను హేమంత్ ఉన్నారు.

## కాశీబుగ్గ సీఐకు సన్మానం



పలాస, సెప్టెంబరు 16(వార్త): కాశీబుగ్గలోని జామియా మసీద్‌లో మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ జామియా మసీద్‌కు విచ్చేసిన కాశీబుగ్గ టౌన్ సీఐ దాడి మోహనరావును జామియా మసీద్ అధ్యక్ష , కార్యదర్శులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిలానీ, హుస్సేన్, షాహిద్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

నరసన్నపేట, సెప్టెంబరు 16(వార్త): నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమార్తె కనబడడం లేదని సారవకోట మండలానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలేజీ బస్సుకు రోజూ వెళ్లేదని.. శనివారం కూడా అలాగే కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పాతపట్నం, సెప్టెంబరు 16 (వార్త): పాతపట్నం మండలం పాసిగంగుపేట గ్రామ శివారులోని ఓ షెడ్ క్రింద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పాతపట్నం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4,640లు, రెండు సెల్ ఫోన్లను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ముగిసిన విజయగణపతి నవరాత్రి ఉత్సవాలు

సారవకోట, సెప్టెంబరు 16(వార్త): సారవకోట మండలం ఆవలింగిలో గల శ్రీ విజయ గణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక హోమాలు, పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు అనంతరం పురోహితులు జానీప్రసాద్ శర్మ సోమవారం ఆలయంలో విశేష పూజలు చేపట్టారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్



నరసన్నపేట, సెప్టెంబరు 16(వార్త): పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

సోమవారం ఉద యం 9గంటల సమయంలో నరసన్నపేట మండలం మడపాం టోల్ గేట్ సమీపంలో బరంపూర్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేశామన్నారు.

ఆ లారీలో 34 పశువులు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. లారీ డ్రైవర్ని అదుపులోకి తీసుకొని ఆవులను కొత్తవలస గోశాలకు తరలించామని తెలిపారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల వినూత్న ప్రదర్శన




పాతపట్నం, సెప్టెంబరు 16(వార్త): అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఓజోన్ పొర ఆవశ్యకత ను తెలియజేస్తూ పాతపట్నం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం వినూత్న ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల వృక్ష శాస్త్ర ఉపాధ్యాయుడు అప్పలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు చాలా సృజనాత్మకంగా గొడుగును ఓజోన్ పొరగా, గ్లోబ్‌ను భూమిగా చూపిస్తూ, ఓజోన్ పొర మానవాళిని రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఆ పొరను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనదేనని సందేశాన్నిచ్చేలా దీనిని తీర్చి దిద్దారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రత్న కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వంగర, సెప్టెంబరు 16(వార్త): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన సంగాం శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు సమక్షంలో సోమవారం పూజలు నిర్వహించారు. భక్తులు శివునికి ప్రీతికరమైన ప్రసాదాలను పెట్టి పూజలు జరిపారు. అనంతరం శివుని ప్రసాదాలను స్వీకరించారు. ఇక్కడ ఆలయంలో నిత్యం పూజలు జరుగుతుంటాయి. దీంతో పాటు ప్రతి సోమవారం చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు వచ్చి, శివునికి పూజలు నిర్వహిస్తారు.

## వాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

వంగర, సెప్టెంబరు 16(వార్త): ప్రతి ఒక్క వాహన చోదకుడు తప్పకుండా హెల్మెట్, లైసెన్స్, సీబుక్ తో పాటు అన్ని పత్రాలు తప్పక కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన వంగర హై స్కూల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు మైనర్లకు ఇవ్వొద్దని, అలా ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. టూ వీలర్స్‌తో పాటు ఫోర్ వీలర్స్ తనిఖీలు చేపట్టారు. రూల్స్‌కు విరుద్ధంగా నడిపిన వాహన చోదకులకు ఫైన్ వేశారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



## కాలువలో గుర్రపు డెక్క..
# ఆగిన నీటి ప్రవాహం



జలుమూరు, సెప్టెంబరు 16(వార్త): జలుమూరు మండలం మర్రివలస పంచాయతీ మాకివలస (ఎస్టీ) వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువపై ఉన్న కాలి నడక వంతెన వద్ద గుర్రపు డెక్క పేరుకు పోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై వంశధార జేఈ ధనుంజయరావు వద్ద ప్రస్తావించగా వెంటనే తొలగించేలా చర్యలు చేపడతామన్నారు.

# అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలి



నరసన్నపేట, సెప్టెంబరు 16(వార్త): విద్యార్థులు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్ సూచించారు. సోమవారం ఆయన నరసన్నపేట మండలం ఉర్లాం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం నుంచి అల్బెండజోల్ మాత్రల పంపిణీ కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత పిల్లలకు ఈ మాత్రలను ఇవ్వాలని సూచించారు.

**జలుమూరు:** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం చేపడుతున్నామని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వంశీకృష్ణ తెలిపారు. అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఉచితంగా ఇస్తారన్నారు. 1-2 వయసు పిల్లలకు 1/2 మాత్ర, అల్బెండజోల్ 2-19 వయసు పిల్లలకు 1 మాత్ర వేయాలని సూచించారు. ఒకవేళ హాజరు కాని పిల్లలకు ఈ నెల 25న ఈ మాత్రలు అందజేస్తామన్నారు. ఈ మాత్ర బాగా నమిలి మింగాలని సూచించారు. ఈ మాత్ర రక్తహీనతను నివారిస్తుందని, పోషకాల గ్రహీతను మెరుగుపరుస్తుందని, శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. నులిపురుగుల సంక్రమణను తగ్గించడానికి గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలని, ఆహారంపై మూతలు ఉంచాలని సూచించారు. కూరగాయలు, పండ్లను శుభ్రమైన నీటితో కడగాలి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, బయటకు వెళ్లేటప్పుడు చెప్పులను ధరించాలని, ఆరుబయట మలవిసర్జన చేయరాదని తెలిపారు. ఏదైనా తినక ముందు, తిన్న తరువాత, మరుగుదొడ్లను వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలని తెలిపారు.

# పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు, సెప్టెంబరు 16 (వార్త): గులివిందల పేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతాడ నారాయణరావుకు ఇటీవల బైపాస్ సర్జరీ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కొత్తూరు మండల నాయకులతో కలిసి సోమవారం ఆయనను పరామర్శించారు. గూనబద్ర గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంపిలి బుచ్చిబాబు భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. వీరిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చింతాడ సూర్యనారాయణ, గండివలస ఆనందరావు, లోతుగడ్డ తిరుపతిరావు, వనుమ లక్ష్మీనారాయణ, వడమ శ్రీనివాసరావు, పంకజ్‌దాస్, కొత్తూరు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విజేతలకు అభినందన



మందస, సెప్టెంబరు 16 (వార్త): హరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు ఇటీవల జరిగిన పలు క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపారు. పలాసపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం పొందారు. ఈ ప్రాంతంలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, స్థానాలను కంచరాల జ్యోత్స్న, గున్న ప్రక్షిత, మూల పవిత్ర, కె.రస్మిత బృందం పలు బహుమతులు సాధించారు. వీరిని ఉపాధ్యాయులు జి.తేజేశ్వరరావు, ఎం.చక్రధరరావు, పి.లోకనాథం, జి.రమణబాబు, జి. కోదండరావు, పి.జగన్మోహన్‌రావు, డి.కృష్ణారావు, సంతోష్‌కుమార్ పండా, కె.అరుణకుమారి, ఎస్.రామారావు, ఎస్.రేణుక, బి.తిరుపతిరావు, బి.లక్ష్మీనారాయణ, కె.మంజుల, ఎస్.ఈశ్వరి, ఎస్.తులసి, పి.ఇందుమతి, ఎస్.స్వప్న, కె.సాంబమూర్తి, ఎస్. ప్రభాకరరావు, కె.శేషగిరిరావు, బి.రామారావు, బి.శశికళ, గ్రామపెద్దలు అభినందించారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామానందం మృతి



మందస, సెప్టెంబరు 16 (వార్త): మందస పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంపోలు రామానందం ఆకస్మికంగా మరణించారు. ఈ ప్రాంతంలో ఉపాధ్యాయునిగా సేవలందించిన రామానందం మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న పలువురు విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నారు. ఆయన కుమారుడు నాగరాజు నేవీలో ఉన్నతాధికారిగా పని చేస్తూ.. 10 నెలల క్రితమే హటాత్తుగా విశాఖపట్నంలో మరణించారు. ఏడాది కాకుండానే తండ్రీ, కుమారుడు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

## పారసిల్లి రహదారి..
# సొగసు చూడతరమా!



ఇటీవల కురిసిన వర్షాలకు నరసన్నపేట మండలంలోని పారసిల్లి నుంచి రెల్లివలసకు వెళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. వర్షం పడి 15-20 రోజులైనా బురదమయంగా ఉందని, రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్ బీ శాఖ అధికారులు స్పందించి ఈ రోడ్డును బీటీ రోడ్డుగా చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

-నరసన్నపేట


# మేమున్నామని..!

■ రోడ్డు పనులు చేసేందుకు ముందుకొచ్చిన జేసీబీ సంఘం

పలాస, సెప్టెంబరు 16(వార్త): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఆలోచన చేయకుండా తామే రోడ్డు పనులు చేద్దామని జేసీబీ సంఘం ముందుకు వచ్చింది. ఆ యూనియన్ నాయకుడు గొనప నిరంజన్ తన సొంత సొమ్ముతో ఆ రోడ్డు పనులు చేశారు.

కాశీబుగ్గ ఫ్లైవర్ బ్రిడ్జికి ఇరు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డు గోతులు మయముతో రాళ్లు పైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాశీబుగ్గ నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిపై గోతులు రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్ల విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో జేసీబీ సంఘం నేత రోడ్డు పనులు చేసేందుకు ముందుకొచ్చారు. సుమారు అర కిలో మీటర్ వరకు ఈ రోడ్డు పనులు జరిపించారు. ఈ సందర్భంగా నిరంజన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.





రోడ్డు పనులు చేయిస్తున్న జేసీబీ సంఘం నేత నిరంజన్, బాగు పడిన రహదారి (ఇన్‌సెట్‌లో) →

## కేంద్రమంత్రి రామ్మోహన్‌ని కలిసిన మామిడి



పాతపట్నం, సెప్టెంబరు 16 (వార్త): ఆసియా, పసిఫిక్ సభ్య దేశాల చైర్మన్‌గా ఎన్నికైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సోమవారం శ్రీకాకుళంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

## శిథిలావస్థలో రైతుబజార్..!



నరసన్నపేట, సెప్టెంబరు16(వార్త): నరసన్నపేటలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రైతుబజార్ శిథిలావస్థకు చేరింది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించిన రైతుబజార్ పేరుకే పరిమితమైంది. కనీసం స్థానిక రైతులు, వ్యాపారులకు ఇక్కడ అవకాశం ఇవ్వలేదు. దీంతో ఈ దుస్థితి నెలకొంది. రైతుబజార్ చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుపోయి దారుణంగా దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి బాగు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## కొత్తవలసలో గణనాథుని నిమజ్జనోత్సవం

వంగర, సెప్టెంబరు 16 (వార్త): వంగర మండలంలోని కొప్పర కొత్తవలస గ్రామంలో కోలాటాలు, డ్యాన్సుల మధ్య సోమవారం వినాయక నిమజ్జనోత్సవం జరిపారు. ఆ గ్రామ పెద్దలు గోవింద్, మహేష్ తదితరులు అధ్వర్యంలో గణనాయకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యువకులు, గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# గ్రామగ్రామాన అన్నసంతర్పణలు





వంగర, సెప్టెంబరు 16(వార్త): వినాయకుని నవరాత్రులు సందర్భంగా కోణంగిపాడు గ్రామంలో సోమవారం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. తొలుత గణనాథునికి పూజలు నిర్వహించి, గ్రామ పెద్దలు, భక్తులు వినాయక ప్రసాదాలను స్వీకరించారు.

**గార :** కె.మత్స్యలేశం, వాడపాలెం గ్రామంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సోమవారం అన్న ప్రసాద వితరణ జరిపారు. సుమారు 1000 మంది భక్తులు ఈ ప్రసాదాన్ని స్వీకరించి లంబోదరుడి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కోరాడ మౌనిక, మన్మథ రావు, సకలాబత్తుల శివ సంతోష్‌కుమార్, దుగ్రు మౌనిక, కావ్య, గనగళ్ల లక్ష్మి, మన్మథరావు, గనగల పుష్ప పాల్గొన్నారు. అనంతరం విఘ్నేశ్వరుడిని గంగలో నిమజ్జనం చేశారు.


## రట్టిలో మొక్కలు నాటిన గ్రీన్ ఆర్మీ



మందస, సెప్టెంబరు 14 (వార్త): మందస మండలంలోని బేతాళపురం పంచాయతీలో గల రట్టి గ్రామం యువజన సంఘం పిలుపు మేరకు వేప, కదంబ, బాదం, చెర్రీ, తురాయి ఇతర నీడనిచ్చే మొక్కలను గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో వల్లభ నారాయణస్వామి దేవాలయం, సముద్ర తీర ప్రాంతంలో నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ తిత్లీ తుఫాన్ దాటికి పూర్తిగా ధ్వంసమైన తోటలు, పర్యావరణం పచ్చదనం పునరుద్ధించడానికి భారీగా మొక్కలు నాటాలని యువతను కోరారు. సముద్ర తీరం వెంబడి గాలి వేగాన్ని తగ్గించడానికి సరుగుడు, ఇతర మొక్కలు నాటాలన్నారు. పర్యావరణం సమతుల్యతకు మొక్కలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, రట్టి వైకుంఠ రావు, ఈశ్వరరావు, రమేష్ గ్రీన్ ఆర్మీ సభ్యుడు నూకల హేమసుందర్, పలాస వాసి దిలీప్, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



# గోవిందరాజులకు ఘన సన్మానం

**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబరు 16 (వార్త):** శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వహించిన నెలవారీ సంగీత కార్యక్రమంలో డీటీపీ డిజైనర్ పందిరి గోవింద రాజులుకు నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ కప్పి జ్ఞాపిక, సన్మాన పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎండిఏ. వ్యవస్థాపక అధ్యక్షుడు మావుదూరు సత్యన్నారాయణ శర్మ, గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.మాలతి, మండ శ్రీనివాసరావు, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, గౌరీశంకర్ శాస్త్రి, కళాకారులు, ఎస్ఎండిఏ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు



**పలాస, సెప్టెంబర్ 16 (వార్త):** ఉద్దానంలో ప్రభుత్వ నిబంధనలను కొందరు కేబుల్ ఆపరేటర్లు పాటించకపోయినా విద్యుత్ శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. విద్యుత్ స్తంబాలపై కేబుల్ ఆపరేటర్లు వైర్లను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. కేబుల్ వైర్లు ఉంటే ఒక్కోక్క స్తంభానికి రూ.20లు చొప్పున ఆ శాఖకు కేబుల్ ఆపరేటర్లు చెల్లించాల్సివుంది. అయితే ఆపరేటర్లు ఎవరూ కూడా ఈ మొత్తాలు చెల్లించిన దాఖలాలు లేవు. ఇంతవరకు రికార్డు ప్రకారంగా ఎన్ని విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు నడుస్తున్నాయి అన్న సమాచారాన్ని విద్యుత్ శాఖాధికారులు కూడా బయటకు చెప్పడం లేదు. విద్యుత్ శాఖలో ఎవరిని అడిగినా తమకు తెలియదనే చెబుతున్నారు. బొడ్డపాడు సహాయ లైన్‌మెన్ సంతోష్ కుమార్ వద్ద విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్ల విషయంలో నిబంధనల మేరకు ఆ శాఖకు డబ్బులు కడుతున్నారా అని అడగ్గా తనకేమీ తెలియదని చెబుతుండడం గమనార్హం. ఈ సహాయ లైన్‌మెన్ బొడ్డపాడులో ఉండాల్సివుండగా, పక్క మండలమైన వజ్రపుకొత్తూరులో నివాసముంటున్నాడు. ఎవరికైనా విద్యుత్ సమస్య ఉంటే తక్షణం పరిష్కరించే వారు కరువయ్యారన్న విమర్శలు బొడ్డపాడులో వినిపిస్తున్నాయి.



## 'పార్టీ ఆస్తులకు నష్టం కలిగిస్తే సహించం'

**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబరు 16 (వార్త):** పార్టీ ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేంది లేదని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కేఎల్‌వీఎస్ ఈశ్వరి, పట్టణ అధ్యక్షుడు ఆర్.సురేష్, దాలినాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు

**వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 16 (వార్త):** వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో గత మూడురోజులుగా జరుగుతున్న 36వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతలకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నిర్వాహక పీఈటీ పిగజేంద్రరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోహనరావు, ఉమామహే శ్వరరావు, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 18 కిలోల గంజాయి స్వాధీనం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16 (వార్త):** ఒడిశా రాష్ట్రం కోదల రాంపల్లి నుంచి ముంబైకి తరలిస్తున్న 18 కిలోల గంజాయిని కంచిలి పోలీసులు సోమవారం పట్టు కున్నారని ఏఎస్పీ పి.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. కోదల రాంపల్లి గ్రామానికి చెందిన సంజయ్ పొలాట, సాగర్ పొలాట ముంబైలోని ముఖేష్ అనే వ్యక్తితో గంజా యి వ్యాపారం చేస్తున్నారు. 18 కిలోల గంజాయిని సంతోష్ కుమార్ సాహు అనే వ్యక్తికి ఇచ్చి ముంబైలోని ముఖేష్‌కు అప్పగించేందుకు ఏర్పాటు చేసుకున్నారు. సంతోష్‌కుమార్ సాహు సోంపేట రైల్వేస్టేషన్ వద్ద అను మానాస్పదంగా తిరుగుతుండడంతో గస్తీకి వచ్చిన ఎస్ఐ రాజేష్, సిబ్బంది అతడిని ప్రశ్నించారు. బ్యాగులను తనిఖీ చేయగా 18 కిలోల గంజాయి పట్టుబడిందని ఏఎస్పీ తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజేష్‌తో పాటు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో సోంపేట సీఐ బి.మంగరాజు ఉన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**మెళియాపుట్టి, సెప్టెంబరు 16 (వార్త):** సంతలక్ష్మీపురానికి చెందిన ఉంగ ధనలక్ష్మి (28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు ఈనెల 14న కుటుంబ తగాదా నేపథ్యంలో ధనలక్ష్మి పురుగుల మందు తాగేసింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆమెను కరజాడ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి పలాస సీహెచ్‌సీకి, ఆ తర్వాత శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ సోమవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడు..

పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మడపాల సింహాద్రి(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన సింహాద్రి మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడి చేరుకున్న రైల్వే పోలీసులు సింహాద్రి వద్ద దొరికిన ఆధారాల మేరకు మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మడపాల లక్ష్మీ నారాయణ కుమారుడిగా గుర్తించారు. దీంతో ఆ గ్రామస్థుల ద్వారా హైదరాబాదులో ఉంటున్న లక్ష్మీనారాయణకు సింహాద్రి మృతి చెందిన విషయాన్ని అందించారు. సింహాద్రి ఇచ్ఛాపురంలోనే ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటున్నాడు.

## వ్యక్తి ఆత్మహత్య

**నరసన్నపేట, సెప్టెంబరు16 (వార్త):** నరసన్నపేట పట్టణం కలివరపు పేట వీధికి చెందిన వైశ్యరాజు నాగరాజు (32) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడు కొన్నేళ్లుగా ఒక వ్యక్తి వద్ద ఫైనాన్షియల్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నాగరాజు తండ్రి లక్ష్మణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

# రాహుల్ ప్రతిపక్షనేతగా.. పనికిరారు


* భారత ప్రతిష్టను భంగం వాటిల్లేలా మాట్లాడడం సరికాదు
* సిక్కులను ఊచకోత కోసిన నీచ చరిత్ర కాంగ్రెస్‌ది
* బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కరుణాకర్
* సిక్కోలులో బీజేపీ నేతల నిరసన

**శ్రీకాకుళం, సెప్టెంబరు16 (వార్త):** భారత పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా, మతిచలించి మాట్లాడుతున్నాడని, దేశ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నాడని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గొలివి కరుణాకర్ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ భారత దేశంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలిలో సోమవారం బీజేపీ శ్రీకాకుళం అధ్యక్షుడు బిర్లంగి ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాహుల్ చిత్రపటానికి చెప్పులతో కొట్టి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ భారతదేశంలో రిజర్వేషన్లు ఎత్తివేయాలనడం, మన దేశం సిరియాలా తయారవుతోందని అనడం దారుణమన్నారు. సిక్కుల పట్ల మొసలి కన్నీరు కార్చడం కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. 1984లో సిక్కుల ఊచకోత కోసినా నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. మత ఘర్షణలకు పాల్పడడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. భారత ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఈ అసమర్ధ ప్రతిపక్ష నేతను అనర్హుడిగా ప్రకటించాలని రాష్ట్రపతిని కోరారు. నిరసన కార్యక్రమంలో బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు, పూడి తిరుపతిరావు, అట్టాడ రవి బాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు, సురేష్ సింగ్ బాబు, చింతపల్లి గాంధీ, రావాడ పురుషోత్తం, నరేంద్ర చక్రవర్తి, పేడాడ సూర్యకుమారి, పేరూరి శ్రీనివాసరావు, కోరాడ అప్పలరాజు, చిట్టి తవుడు, ముకల్ల లక్ష్మీనారాయణ, బైపల్లి రాజేశ్వరి, గురుగుబెల్లి రాజు, బెండి ప్రసాద్, సోమేశాన్, ఉమామహేశ్వరరావు, రెడ్డి సూర్యప్రసాద్, మదన్, రాజేష్, వడిస ప్రవీణ్, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వచ్ఛతా హీ సేవ పోస్టర్ ఆవిష్కరణ

**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబరు16(వార్త):** స్వచ్ఛతా హీ సేవ కార్య క్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ కార్యాల యం లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విడుదల చేశారు. ఈ కార్య క్రమాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారి శ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు.



## శివాజీనగర్‌లో చోరీ

**పలాస, సెప్టెంబర్16(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తిలక్ నగర్ రెండవ వీధి, శిరిడి సాయిబాబా ఆలయం వెనుక వీధిలో నివాసం ఉంటున్న పెంట విష్ణుమూర్తి ఇంటిలో సోమ వారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక అగంతకుడు చొరబడి చోరికి పాల్పడ్డాడు. బాధితు రాలు కథనం మేరకు పెంట కృష్ణవేణి భర్త విష్ణుమూర్తికి టీ అందించి తను నిర్వహిస్తున్న కిరాణా షాపునకు పంపించింది. అనంతరం ఆమె తన బయట మెట్ల మీద కూర్చొని టీ తాగుతుండగా ముఖానికి రుమాలు కట్టుకొని వచ్చిన అగంతకుడు మంచినీరు కావాలని కోరడంతో ఆమె ఇంటిలోనికి మంచినీరు తేవడానికి వెళ్ళింది ఆమె వెనకే ఆగంతుడు ఇంటిలోకి చొరబడి చంపుతానని బెదిరించి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, మరో చైన్‌ను దోచుకున్నాడు. గాజులు కూడా తీసి ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ గాజులు టైట్‌గా ఉన్నా యని చెప్పడంతో ఆమెను వెనక్కి నెట్టేసి పక్కన ఉన్న ముళ్లపొదలు నుంచి మరొక వీధికి పరుగులెత్తాడు. అనంతరం ఆమె వీధిలోకి వచ్చి మహిళలకు చెప్ప డంతో వీధిలోని పెద్దలు కృష్ణవేణి భర్తకు సమాచారం ఇవ్వడంతో ఆయన ఇంటికి చేరుకొని పోలీసులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు తనిఖీ చేశారు. కాశీబుగ్గ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బొడ్డపాడు విద్యార్థిని ప్రియాంకకు ఎంబీబీఎస్ సీటు

**పలాస, సెప్టెంబర్16 (వార్త):** బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల ప్రియాంక(మీను) ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించి తన ప్రతిభను చాటింది. నీట్ 2024లో జాతీయస్థాయిలో 40 వేల ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 1200 ర్యాంకును సాధించింది. తండ్రి మద్దిల లక్ష్మణ రావు, తల్లి జానకమ్మ మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. ప్రియాంకను గ్రామస్తులు అభినందించారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలి

**హిరమండలం, సెప్టెంబరు 16(వార్త):** స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 17,18 తేదీల్లో సబ్జెక్టల వారీగా హిరమండలం, కొత్తూరు మండల కేంద్రాల్లో నిర్వహించనున్నామని, ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 17న తెలుగు సబ్జెక్ట్‌కు జెడ్పీహెచ్ఎస్ అవలంగి, లెక్కలు సబ్జెక్ట్‌కు భగరధీపురం జెడ్పీహెచ్ఎస్‌లో, భౌతిక శాస్త్రానికి జెడ్పీహెచ్ఎస్ మెట్టూరులో నిర్వహిస్తామన్నారు. 18న ఆంగ్ల సబ్జెక్ట్‌కు జెడ్పీహెచ్ఎస్ తంప, సాంఘీక శాస్త్ర సబ్జెక్ట్‌కు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హిరమండలంలో, హింది సబ్జెక్ట్‌కు జిహెచ్ఎస్, కొత్తూరులో నిర్వహిస్తామన్నారు. అలాగే బయోలజికల్ సైన్స్ సబ్జెక్ట్‌కు జెడ్పీహెచ్ఎస్ కుంటిభద్రలో నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయన్నారు. ఇందుకు స్కూల్ అసిస్టెంట్స్ ఉపాధ్యాయులతో పాటు 6,7,8 తరగతులు బోధించే ఎస్జీటీలు కూడా తప్పక హాజరు కావాలన్నారు.

## ప్రతి విద్యార్థి మాత్రలు వేసుకోవాలి

### వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ



**సంతబొమ్మాళి, సెప్టెంబర్16(వార్త):** నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మొత్తం 3093 విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలు వేయాల్సి ఉందని తెలిపారు. పీహెచ్సీ పరిధిలో 3 కాలేజీలు, 20 పాఠశాలలు, ఒక ప్రైవేట్ పాఠశాల, 28 అంగన్వాడీ సెంటర్‌లలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం లో భాగంగా ఆల్బెండ జోల్ మాత్రలు వేయనున్నామన్నారు. ఈ మాత్రల వలన రక్తహీన త నుంచి ఉపశమనం కలుగుతుందని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని అన్నారు.

## డీఎస్సీ మెటీరియల్ పంపిణీ

**పాతపట్నం, సెప్టెంబర్16(వార్త):** పాతపట్నం నియోజకవర్గ కేంద్రం లోని మహేంద్ర జూనియర్ కళాశాలలో మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంజీఆర్ ఉచిత మెగా డిఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తు న్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న 500మందికి కాంపిటేటివ్ పుస్తకాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి సోమవారం ఉచితంగా పం పిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈకాంపిటేటివ్ పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. పాతపట్నంలో డీఎస్సీ శిక్షణ పొందు తున్న వారు జిల్లాలో అత్యధిక పోస్టులు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ తీసుకోవ డం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సొంత నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడి గోవిం దరావు ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. కార్యక్ర మంలో డీఈవో తిరు మల చైతన్య, రేస్ ఇని స్టూట్ నిర్వాహకుడు విశ్వేశ్వరరావు, తది తరులు పాల్గొన్నారు.




# గంగమ్మ ఒడికి గణనాథుడు

**హిరమండలం, సెప్టెంబరు16(వార్త):** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కొలువు దీరిన గణనాథులు తొమ్మిదిరోజుల పాటు పూజలందుకొని గంగమ్మ ఒడికి చేరాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉత్సవ కమిటీలు, యూత్ కమిటీలు ప్రతి ష్ఠించిన గణనాథులను వంశధార నదిలో నిమ జ్జనం చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్రలను నిర్వహిం చారు. సోమవారం హిరమండలం మేజర్‌పంచాయతీ దేవరశెట్టి వీధిలో ఉన్న సత్యసాయి సేవా సమితి ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను నిమ జ్జన ఊరేగింపు కార్యక్రమం అలికాం-బత్తిలి ప్రధాన





రహదారిలో ఊరేగించారు. అలాగే చిన్న కోరాడ వీధి, భగరధీపురంతో పాటు పలు చోట్ల గణపతి నిమజ్జన కార్య క్రమంలో తీన్ మార్ డప్పులకు యువత డ్యాన్స్ చేస్తూ ఉర్రూతలాడారు. అవాంచనీయ సంఘ టనలు జరగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వ ర్యంలో చేపట్టిన వినాయక విగ్రహ నిమజ్జన కార్య క్రమంలో సత్యసాయి జోనల్ కన్వీనర్ బెహరా సురేష్ (చంటి మాస్టారు), కన్వీనర్ ఊణ్న వెంకటరమణ, సత్యసాయి భక్తులు, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

**పొందూరు:** మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఉమామహేశ్వర భజన మందిరం వద్ద వరసిద్ధి వినాయక నవరాత్రుల మహోత్సవం సంద ర్భంగా ఆదివారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహిం చారు. ఎరుకల పేట గ్రామానికి చెందిన చిగిలిపల్లి సురేష్ రూ.24.399కి వేలం పాడారు. 9కేజీల లడ్డూతోపాటు 50గ్రాముల వెండి విగ్రహాన్ని పాటలో దక్కించుకు న్నారు. లడ్డూను గ్రామంలో ఊరేగిం చారు. సోమవారం రాత్రి వినాయక విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి నిమ జ్జనం చేశారు. కార్యక్ర మంలో ఉమామహేశ్వర సేవాసంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసుల వివరాలు అప్‌లోడ్ చేయండి

- ❋ కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం
- ❋ ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
- ❋ పోలీసులు, అధికారులతో సమీక్ష





**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు16 (వార్త):** కేసుల పరిష్కారం, శిక్షలు పడేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకమని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో కోర్టు కాని స్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, వివిధ కోర్టులో సమన్వయ అధికారులుగా పని చేస్తున్న కోర్టు మాని టరింగ్ సిస్టం సిబ్బందితో సోమవారం పోలీసు కార్యాలయంలో వివిధ అంశాలపై ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు కేసు ప్రతీ అంశాన్ని సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. నెల వారీగా కోర్టులు జారీ చేసిన సమన్లు, వారంట్లును పోలీసు స్టేషను ప్రోసస్ రిజిష్టరులో నమోదు చేసి, రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగాలన్నారు. కోర్టుల్లో దాఖలైన అభియోగ పత్రాలను న్యాయస్థానాలు దాఖలు చేసిన సమయంలో కేసు రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పత్రాలను సమర్పించి ముందు ప్రతి విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులు దృష్టిలో పెట్టి, అభియోగ పత్రాలను కోర్టుల్లో దాఖలు చేయాలన్నారు. చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు విచారణ త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలన్నారు శిక్షలు పడేందుకు అవకాశం ఉన్న కేసుల్లో పబ్లిక్ ప్రాసక్యూటర్‌లతో మాట్లడి సక్రమంగా పూర్తి అయ్యే విధంగాను, సాక్షులు సాక్ష్యం చెప్పేందుకు బ్రీఫింగ్ ఇప్పించాలన్నారు. కేసు ప్రాపర్టీ సకాలంలో ప్రవేశపెట్టి, నిందితులకు శిక్షలుపడే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుతో కోర్టు కానిస్టేబుళ్ళు సమన్వయం సాధించాలన్నారు. ప్రాధాన్యత కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కేసు విచారణ త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో సిఎంఎస్ ఎస్ఐ పారినాయడు, డిసిఆర్బి ఎస్ఐ నేతాజీ, పోలీసు స్టేషనులకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లు, సిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

- ❋ జిల్లాలో జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు
- ❋ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

**పొందూరు,సెప్టెంబర్16(వార్త):** జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి లోనూ రాణించారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక పార్కులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సోమ వారం ఆయన ప్రారంభించారు. వినాయక చవితిని పురస్క రించుకుని కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిం చారు. ఈపోటీలలో మొదటి బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.7వేలును విజేత లకు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి కూన రవికుమార్ మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాకు ఉన్న కీర్తిని కాపాడుకునేందుకు నిరంతర సాధన చేయాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. పట్టుదల, నిరం తర సాధనచేస్తే నైపుణ్యాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పూంద్రు లక్ష్మి, ఎంపీటీసీ ప్రతినిధి బాడాన శేషగిరిబాబు నాయుడు, యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాళ్లకూరి శాంతా రాం, తదితరులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413